క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ (ఆపరేషన్స్) పి.హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ.. పద్మజానగర్, శ్రీనివాసానగర్, కెనాల్‌బండ్, బందరు రోడ్డు ఫీడర్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు. యనమలకుదురులో ఇందిరానగర్ 1, 2 కట్టలు, జన్మభూమి వంతెన ప్రాంతం, డొంకరోడ్డు, తాడిగడపలో లిబ్రాకాలనీ, శ్రీనివాసానగర్, వసంతనగర్ కాలువ కట్టలు, రామానగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్థానికులు సహకరించాలని కోరారు.

రేపు అమ్మవారికి శాకంబరి అలంకరణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో లాకుల సెంటర్‌లో వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 26వ తేదీన అమ్మవారికి శాకంబరి అలంకరణ చేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి యువీ ప్రసాదారావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ.. శుక్రవారం అమ్మవారికి శాకంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. శాకంబరి అలంకరణలో పాల్గొనే భక్తులు గురువారం అమ్మవారికి కూరగాయలు అందజేయాలని కోరారు. శ్రీ భవాని భక్త బృందం సహకారంతో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా చేస్తామని తెలిపారు.

ఎంపీడీఓ శ్రీరమ్య బదిలీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీరమ్య బదిలీ అయ్యారు. ఏపీ టూరిజం శాఖలో గుంటూరు జిల్లా అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెను నియమించింది. రూరల్ ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న బీఎల్వీ శేషగిరిరావు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బండారుగూడెంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతిపత్రం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలతో డ్రెయినేజీలోని మురుగునీరు రోడ్లపై పారుతుందని, దోమలు విపరీతంగా వ్యాపించాయని ఆయన వాపోయారు. అంతేకాక గ్రామంలో విష జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని, దీని నివారణకై శానిటేషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు చేపట్టండి



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆయన పోరంకిలో తన కార్యాలయంలో బుధవారం రాత్రి నియోజకవర్గ స్థాయిలో ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో నిధులు అందుబాటులో ఉన్నందున అభివృద్ధి పనులు చేయాలన్నారు. మిగితా మండలాలకు నిధులు త్వరలో సమకూరుతాయని, అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

భవితకు అవరోధాలుగా బాల్య వివాహాలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బాల్యవివాహాలు బాలల భవితకు అవరోధాలుగా మారతాయని, అధికారుల సమన్వయంతో అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ వై.శంకర్‌నాయక్ అన్నారు. కొండపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 2006 బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, అరికట్టడంలో తల్లిదండ్రుల పాత్రపై అవగాహన కల్పించారు. బాలికలకు 18, బాలురకు 21 ఏళ్ల వయస్సులోనే వివాహాలు చేయాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో పుష్పలత బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బాల్యంలో వివాహాలు జరిగితే ఎదురైయ్యే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. డీసీపీవో దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. గ్రామాల్లో సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ 1098, 100, 108 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. దోమల ఉత్పత్తి కేంద్రాలు

- ప్రజారోగ్యానికి ముప్పు తప్పదా?
- అలసత్వం వీడని అధికారులు
- ఖాళీస్థలాల్లో నిలిచిపోతున్న మురుగు



కంకిపాడు పట్టణంలోని ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, మురుగు

కంకిపాడు: అసలే వర్షాకాలం..ఆపై విజృంభిస్తున్న దోమలు..వ్యాప్తి చెందుతున్న వ్యాధులు..అయినా అధికారుల తీరులో మాత్రం మార్పులేదు. ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ఫలితంగా ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..

కొద్ది రోజులుగా విడవకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. అంతర్గత రహదారుల్లో వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. రోజుల తరబడి మురుగు కదలక తీవ్ర దుర్గంధం వెలువడటంతో పాటుగా దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దోమలు విజృంభించటంతో ఇప్పటికే వైరల్ జ్వరాలు, సాధారణ జ్వరాలు, దగ్గు, జలుబులతో ప్రజలు ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కంకిపాడు గోడు పట్టదా..?

మండల కేంద్రమైన కంకిపాడులో ఖాళీస్థలాల సమస్య అధికంగా ఉంది. పట్టణం నడిబొడ్డున ఉన్న అనేక ప్రాంతాల్లో ఖాళీస్థలాలు ఉన్నాయి. స్థల యజమానులు వీటిని కనీసం మెరక చేయకుండా, మురుగు పోయే మార్గం ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో ఆయా స్థలాల్లో మొక్కలు పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తున్నాయి. వర్షాలకు నీరు నిలిచిపోయి చెరువులు, నీటి కుంటలుగా మారాయి. ఖాళీ స్థలాల్లో దోమలు ఉత్పత్తి చెంది ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. కంటి మీద కునుకు కరువై పట్టణ వాసులు తమ ఆరోగ్యాల పట్ల ఆందోళన చెందుతున్నారు. దోమలతో పాటుగా పాములు, ఇతర విష కీటకాలకు ఈ స్థలాలు ఆవాసంగా మారటంతో ఆ స్థలాల వెంబడి రహదారుల మీదుగా రాత్రిళ్లు నడిచి వెళ్లే పరిస్థితి లేదు. ఎప్పుడు ఏ కీటకం బారిన పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందోనన్న భయం పట్టణ వాసుల్లో నెలకొంది.

అధికారుల తీరులో మార్పేదీ..?

ఖాళీ స్థలాల కారణంగా పట్టణ వాసులకు అటు ఆరోగ్యం, ఇటు ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. కానీ పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులు కనీస చర్యలు తీసుకున్న పాపాన పోవటం లేదు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వటం, మురుగు తొలగించటం, దోమల వ్యాప్తిని అరికట్టే చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నా, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లక ముందే తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

రైతుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రామవరప్పాడు: రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని టీడీపీ మండల కార్యాలయంలో బుధవారం వెంకట్రావు సొంత నిధులు సుమారు కోటి రూపాయలతో 50 మోటార్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రైతు బిడ్డగా రైతుల కష్టాలను తెలుసుకుని వీరి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు మోటార్ల కొరత ఉందని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఎన్నికల ప్రచారంలో రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సొంత నిధులు వెచ్చించి మోటార్లు అందించి మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. గతంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా పని చేసిన సమయంలో జిల్లాలో చనిపోయిన రైతులకు లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా అందజేసినట్లు తెలిపారు. జీడిమెట్ల నుంచి 150 మంది పారిశ్రామిక వేత్తలు గన్నవరం నియోజకవర్గంలో పరిశ్రమలకు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో ఏలూరు కాలువలపై వంతెనలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్, నియోజకవర్గంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శీలం రంగారావు

రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పలు అంతర్గత రహదారులకు బుధవారం మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూనగర్, ఎయిర్‌టెల్ డొంక రోడ్డు, సాగు కాలువ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను రంగారావుతో పాటు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలోని పలు రహదారులు దెబ్బ తిన్నాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన దెబ్బతిన్న రహదారులపై గోతులు పూడ్చించి, మట్టితో చదును చేసినట్లు తెలిపారు. డ్రెయిన్లలో పూడిక తీయించి మురుగునీరు సజావుగా పారేటట్లుగా వెడల్పు చేయించామన్నారు. రైతుల ప్రయోజనార్థం పోరంకి రోడ్డులో జేసీబీ సహాయంతో పంటకాలువ పూడుకతీత పనులను పూర్తి చేసినట్లు వివరించారు.

ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్



కానూరులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



దోమల మందు పిచికారీ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

పెనమలూరు: కానూరు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టామని వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం కానూరు గ్రామంలో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్యంపై సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో పెద్ద చెరువు ప్రాంతంలో డ్రెయినేజీ సక్రమంగా లేకపోవటంతో మురుగునీరు పారుదల లేదన్నారు. ఇది దృష్టిలో ఉంచుకొని డ్రెయిన్లలో జేసీబీతో పూడిక తీయిస్తున్నామని అన్నారు. గ్రామస్తులు కూడా వ్యర్థాలు డ్రెయిన్లలో వేయకుండా చెత్త కుండీలు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. చెత్త రహిత గ్రామంగా కానూరు మారాలంటే గ్రామస్తుల సహకారం కూడా కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని కుందేరులో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. డ్రెయినేజీల్లో పూడికలు తీయటం, దోమల మందు పిచికారీ చేయించటం, రోడ్ల వెంబడి వ్యర్థాల తొలగింపు పనులు నిర్వహించారు. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. దోమల నిర్మూలన చర్యలు పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, ఏఎన్‌ఎం బేబీ, ఆశ కార్యకర్త శారద, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వీధికుక్కల స్వైర విహారం

పట్టించుకోని పంచాయతీలు



స్వైర విహారం చేస్తున్న వీధికుక్కలు

విజయవాడరూరల్: వీధికుక్కల స్వైర విహారంతో గ్రామాల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వీధి కుక్కలు వేట కుక్కలుగా మారుతున్నాయి. ఆదమరిస్తే కరిచివేస్తున్నాయి. నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, తదితర గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ స్వైర విహారం చేస్తూ ప్రజలను భయపెడుతూ వెంట పడుతున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే వీధిలో కుక్కలు ఉన్నాయో లేదో చూసుకొని రావాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఎంతలా ప్రజానీకం భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. పిల్లలు తినుబండారాలను చేత పట్టుకొని వెళుతుంటే అంతే ఎత్తులో ఉండే కుక్కలు వాటిని పట్లుకొని పరుగెత్తుతున్నాయి. వీధి కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఏమీ చేయలేమని గ్రామ పంచాయతీ అధికారులు చెబుతున్నారు. కుక్కలను పట్టుకొని జనసంచారం లేని ప్రాంతాల్లో వదిలి వేయాలని ప్రజలు కోరుతున్నారు. కుక్కల వలన రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని, మృత్యువాత పడవచ్చని గ్రామాల్లో ప్రజలు భయపడుతున్నారు. కుక్కల సంఖ్య పెరగకుండా స్టెరలైజేషన్ చేయాలని కోరుతున్నారు.

సాగు భూమిని పరిశీలించిన కోర్టు కమిషనర్



గంగూరులో రైతు సాగు చేస్తున్న భూమిని పరిశీలిస్తున్న కోర్టు కమిషనర్

పెనమలూరు: గంగూరులో పేద దళిత రైతు సాగు చేస్తున్న ఇరిగేషన్ భూమిని అధికారులు బలవంతంగా ఖాళీ చేయాలని చేసిన యత్నంపై హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఘటన వివరాల్లోకి వెళితే.. గంగూరు గ్రామ పరిధి బందరు కాలువ కట్ట ప్రాంతంలో గుంటతోట కోటేశ్వరరావు అనే దళిత రైతు 81 సెంట్ల ఇరిగేషన్ భూమి సాగు చేస్తున్నాడు. తన తండ్రి మాజీ సైనిక ఉద్యోగి కావటంతో 1985 సంవత్సరంలో ప్రభుత్వం సాగు చేసుకోవటానికి లీజు ఇచ్చింది. లీజు సొమ్ము క్రమం తప్పకుండా చెల్లించారు. కాగా ఇరిగేషన్ శాఖ అధికారులు గత కొద్ది రోజుల క్రితం దళిత రైతు సాగుచేస్తున్న భూమలోకి ప్రవేశించి కంచె తొలగించారు. రైతును భూమి ఖాళీ చేయాలని హెచ్చరించారు. దీంతో రైతు హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటీషన్ 15667/2024 కేసు వేశాడు. కోర్టు ఇరు పక్షాల వాదనలు విన్న తరువాత రైతు సాగు చేస్తున్న భూమిలోకి అధికారులు ప్రవేశించరాదని ఇంటీరియం ఉత్తర్వులను ఈ నెల 22వ తేదీన జారీ చేసింది. వాస్తవాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోర్టు కమిషనర్‌ను నియమించింది. కాగా కమిషనర్ బుధవారం ఘటనా స్థలం వద్దకు వచ్చి పరిశీలించి వివరాలు నమోదు చేశారు.

ఆభరణాలతో బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇంటిలో ఉన్న తమ కుమార్తె, బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలు అదృశ్యమైనట్లు ఓ తండ్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్‌లో నివసిస్తున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సమీపంలోని మదరసాలో ఉర్దూ నేర్చుకుంటుంది. ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు వెళ్లి సాయంకాలం 4 గంటలకు వస్తూ ఉంటుంది. బుధవారం ఆమె మదరసాకు వెళ్లకుండా ఇంటిలో ఉంది. తల్లిదండ్రులిద్దరూ ఉదయం 11 గంటల సమయంలో హాస్పిటల్‌కు అని బయటకు వెళ్లారు. తిరిగి గంట తరువాత ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో ఉన్న తమ కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద విచారించినప్పటికి ఆమె ఆచూకీ లభించలేదు. ఇంట్లో ఉన్న ఆరు కాసుల బంగారం, 30 తులాల వెండి కూడా కనిపించలేదు. దీంతో తమ కుమార్తె, బంగారం, వెండి కనిపించడం లేదంటూ వారు పోలీసులను ఆశ్రయించారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉల్లాసంగా ఆటపాటలు

కాచవరం(ఇబ్రహీంపట్నం): కేంద్ర విద్యా విధానం 2020 వార్షికోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శిక్ష సప్తహ్ కార్యక్రమం కాచవరం ఎంపీపీ పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు బుధవారం ఉల్లాసంగా క్రీడా దినోత్సవం జరిగింది. హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా నేతృత్వంలో బాలబాలికలు ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మానసిక, శారీరక ఆనందానికి క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల ప్రాముఖ్యత వివరించారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్‌లతో శారీరక, మానసిక సమస్యలు



బహుమతులు అందజేసిన డాక్టర్ మన్నె వెంకటరత్నం, ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్మార్ట్ ఫోన్‌లను ఎక్కువ సమయం చూడటం వలన శారీరక, మానసిక సమస్యలు వస్తాయని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు మన్నె వెంకటరత్నం తెలిపారు. నలంద డిగ్రీ కళాశాలలో బుధవారం రెడ్యూస్ స్క్రీన్ టైమ్ – డిజిటల్ వెల్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. నలంద కళాశాల విజువల్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఎక్కువ సేపు ఫోన్, కంప్యూటర్ స్క్రీన్‌లతో కలిగే దుష్ఫలితాలను తెలియచేస్తూ, ఐజీఎంసీ స్టేడియం రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో మన్నె వెంకటరత్నం మాట్లాడుతూ విద్యార్థులు స్క్రీన్ టైమ్ తగ్గించుకుని ఇండోర్, అవుట్‌డోర్ యాక్టివిటీస్ పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా చెస్, ఎలక్యూషన్, ఒరిగామి, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, విజువల్ కమ్యూనికేషన్ విభాగం హెచ్ఓడీ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆధార్ క్యాంపులు



పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఆధార్ క్యాంపులో ఆధార్ నమోదు

కంకిపాడు: ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలు మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్నాయి. ప్రత్యేక క్యాంపుల్లో భాగంగా బుధవారం కంకిపాడు జిల్లా పరిషత్, పునాదిపాడు జిల్లా పరిషత్, నెప్పల్లి జిల్లా పరిషత్, గొడవర్రు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆధార్ నమోదు డ్రైవ్ చేపట్టారు. తొలి రోజు నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో మండలం వ్యాప్తంగా 59 మంది హాజరయ్యారు. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 88 మంది సేవలను వినియోగించుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో నిర్వహించే క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆధార్ నమోదు, సవరణల నిమిత్తం మొబైల్ ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బాపులపాడు ఎంపీడీవో రత్నకుమారి ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ నెల 25న వీరవల్లి-2, బాపులపాడు-3, వేలేరు, ఆరుగొలను గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 26న వీరవల్లి, కొత్తపల్లి, వేలేరు, ఆరుగొలనులో, 27న కోడూరుపాడు, కొత్తపల్లి, రేమల్లే, కానుమోలు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవటం, ప్రస్తుత ఆధార్ అప్‌డేట్ చేయటం, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఈ క్యాంపుల్లో అవకాశం కల్పిస్తున్నట్లుగా వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం



కనకరత్నంకు బొకే అందజేస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని శారదా జూనియర్ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ పి.కనకరత్నం అన్నారు. గాంధీనగర్‌లోని శారదా జూనియర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్టూడెంట్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ఇంటరాక్టివ్ బడ్జెట్ సెషన్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సెషన్‌లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. బడ్జెట్ విశేషాలను విద్యార్థులకు వివరించారు. మొత్తం బడ్జెట్, వివిధ రంగాలకు కేటాయింపులు, వ్యయం, రాబడి వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాలలో అర్థశాస్త్రం అభ్యసించే విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులు బడ్జెట్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. శారదా విద్యాసంస్థల కార్యదర్శి రామనారాయణ, ప్రిన్సిపాల్స్ లుక్కా శ్రీధర్, ఎస్.నాగేశ్వర శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మూర్తి, పక్కన ఏసీపీ మురళీకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సులభంగా లోన్ పొందవచ్చని సోషల్ మీడియాలో వచ్చే లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. లింకులు క్లిక్ చేసి యాప్స్ ఇన్‌స్టాల్ చేయొద్దని సూచించారు. యాప్ పనిచేయడానికి మొబైల్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ, మెసేజ్ మైక్ లొకేషన్ వంటి వాటిని యాక్సెస్ చేయవద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ పెద్ద స్కామ్ అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు నమి డబ్బులు చెల్లించి మోసపోవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో ట్రేడింగ్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని వచ్చే ప్రకటనలపై స్పందించవద్దని చెప్పారు. అన్‌నౌన్ వీడియో కాల్స్ లిఫ్ట్ చేస్తే వాళ్లు నగ్నంగా ఉండి, మీకు చేసిన వీడియో కాల్ రికార్డు చేస్తారన్నారు. పోలీసు కేసులో ఇరికిస్తామని బెదిరించి, డబ్బులు దోచుకుంటారని చెప్పారు. డబ్బులు పోగుట్టుకుంటే తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ. ఇన్ సంప్రదించాలని కోరారు. సదస్సులో భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు, సైబర్ క్రైమ్ సీఐ శ్రీను,ఎస్ఐ మూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



చనుపల్లివారిగూడెంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

గన్నవరం రూరల్: సమతుల ఆహారంతో మంచి ఆరోగ్యం సొంతం అవుతుందని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సంధ్య చెప్పారు. బుధవారం మండలంలోని చనుపల్లివారిగూడెంలో స్థానికులకు 104 వాహన వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తినే ఆహారంలో మార్పులు చేసుకుని రోగాలకు దూరంగా ఉండాలని సూచించారు. దీర్ఘకాల రోగాలు సుగర్, బీపీలను నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడుకోవటం మంచిదన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. సీహెచ్‌వో సింధూర, ఏఎన్‌ఎం మేరీ గ్రేస్, ఆశాలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com